ప్రజలకు చంద్రబాబు శాపనార్థాలు, తిట్లు

- కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి



పథకాలు అందుకున్న వృద్ధురాలికి బుక్‌లెట్‌ను అందిస్తున్న ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి

కావలి: అధికారం ఇవ్వలేదని చంద్రబాబు ప్రజలను నిత్యం శాపనార్థాలు పెడుతూ, తిట్ల దండకం సాగిస్తున్నాడని కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి విమర్శించారు. పట్టణంలోని 22వ వార్డులో శనివారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రతి ఇంటికి వెళ్లి గడిచిన నాలుగేళ్లలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అందజేసిన సంక్షేమ పథకాలు వివరాలను ప్రజలకు తెలిపారు. కుటుంబాల వారీగా ప్రభుత్వ పథకాలు అందుకున్న వివరాలతో కూడిన బుక్‌లెట్‌ను లబ్ధిదారులకు అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజలను నమ్ముకున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ప్రజలు ఒక్క అవకాశం ఇస్తే, దేశంలో ఏ ముఖ్యమంత్రి చేయలేని విధంగా అభివృద్ధి, సంక్షేమ పథకాలతో దేశానికే రోల్‌మోడల్‌గా నిలిచారన్నారు. 14 ఏళ్ల ముఖ్యమంత్రిగా పని చేసిన చంద్రబాబు, తాను అధికారంలో ఉన్నప్పుడు ప్రజలకు ఉపయోగపడే ఒక్క పని కూడా లేదన్నారు. ప్రజల్లోకి వచ్చి సీఎం వైఎస్ జగన్‌ను తిట్టి, మళ్లీ తనను గెలిపించకపోతే మీకే నష్టమంటూ ప్రజలకు శాపనార్థాలు పెడుతున్నారన్నారు. ఇతర రాష్ట్రాలతో పోల్చుకుంటే మన రాష్ట్రం అనేక అంశాల్లో దేశానికే ఆదర్శంగా నిలుస్తోందని పలు రంగాల నిపుణులు చెబుతున్నారని ఎమ్మెల్యే గుర్తు చేశారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కులం, పార్టీ, మతం, వర్గం చూడకుండా అర్హతే ప్రామాణికంగా ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందిస్తున్నారని వివరించారు. చంద్రబాబు, లోకేష్, పవన్ కళ్యాణ్ గుడ్డలు ఊడదీసి కొడుతాం, కేసులు పెడుతాం, ప్రతీకారం తీర్చుకుంటాం అంటూ తమ పార్టీ కార్యకర్తలు జారిపోకుండా ఉండేందుకు పిచ్చి ప్రేలాపనలు మాట్లాడటం సిగ్గుచేటని ఎమ్మెల్యే దుయ్యబట్టారు. రాష్ట్రాన్ని అభివృద్ధి చేయాలనే విజన్, ప్రజలకు అన్ని రకాలుగా ప్రభుత్వం అండగా ఉండాలనే విజన్‌లు మాత్రమే ఉన్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని రాష్ట్ర ప్రజలు మరోసారి ఆశీర్వదించేందుకు సిద్ధంగా ఉన్నారని ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి చెప్పారు. ఏ జాతీయ మీడియా సర్వే చేసినా, దేశంలో రాజకీయ పరిస్థితులపై ఎలాంటి స్థితులను చెప్పినా, మన రాష్ట్రంలో మాత్రం ఎప్పుడు ఎన్నికలు వచ్చినా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌కు పట్టాభిషేకం చేయడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. అధికారంలోకి రావడానికి బరితెగించి ఎలాంటి అడ్డదారులు తొక్కడానికైనా సిద్ధంగా ఉన్న చంద్రబాబు కుట్రలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాని ఎమ్మెల్యే సూచించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు కేతిరెడ్డి శివకుమార్‌రెడ్డి, కనమర్లపూడి వెంకటనారాయణ, గంధం ప్రసన్నాంజనేయులు, కనుపర్తి రాజశేఖర్, చెన్ను ప్రసాద్‌రెడ్డి, నెల్లూరు వెంకటేశ్వరరెడ్డి, కాటా శ్రీనివాసులురెడ్డి, షేక్ అబ్దుల్ రహీం, ఖమర్ బాబు, వేమిరెడ్డి విజయకుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

క్లుప్తంగా

రైతులకు గోవులు, కోడెల దత్తత



గోశాలను పరిశీలిస్తున్న శ్రీనివాసరావు

దుత్తలూరు: మండలంలోని నర్రవాడ వెంగమాంబ పేరంటాలు దేవస్థాన గోశాలలో ఉండే గోవులను, కోడెలను ఆసక్తి ఉన్న రైతులకు దత్తత ఇచ్చేందుకు తగు చర్యలు తీసుకుంటామని దేవదాయశాఖ జిల్లా అసిస్టెంట్ కమిషనర్ జె శ్రీనివాసరావు తెలిపారు. శనివారం ఆయన నర్రవాడలోని వెంగమాంబ దేవస్థాన గోశాలను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ గోవులకు పచ్చిగడ్డి వేసేందుకు గోశాల ప్రాంగణంలో పచ్చిగడ్డి పెంచేందుకు తగు చర్యలు తీసుకోవాలని దేవస్థాన సిబ్బందిని ఆదేశించారు. నర్రవాడ పశువైద్యశాల వైద్యాధికారితో మాట్లాడి గోవులు, కోడెలకు తగు టీకాలు, టీఎంఆర్ దాణా అందజేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఈఓ ఉషశ్రీ, దేవస్థాన సిబ్బంది పాల్గొన్నారు.

డివైడర్‌ను ఢీకొన్న వ్యాన్

- ముగ్గురికి తీవ్ర గాయాలు



నుజ్జునుజ్జు అయిన పేపర్ వ్యాన్

కావలి రూరల్: దినపత్రికలను సరఫరా చేసే వ్యాన్ బైక్‌ను తప్పించబోయి డివైడర్‌ను ఢీకొనడంతో ముగ్గురికి తీవ్రగాయాలయ్యాయి. ఈ ఘటన శనివారం కావలిలో జరిగింది. బోగోలు మండలం కొండబిట్రగుంటకు చెందిన దేవనబోయిన మధు తన వ్యానులో నెల్లూరు నుంచి కొండాపురానికి నిత్యం దినపత్రికలు సరఫరా చేస్తుండేవారు. ఎప్పటిలాగే పేపర్లతో వస్తుండగా కడనూతలకు చెందిన చల్లా వెంకయ్య, చీరాలకు చెందిన ఖాదర్‌బీ కావలిలో దిగేందుకు వ్యాన్ ఎక్కారు. కావలి ట్రంకురోడ్డులోని ఏఎం బేకరీ సమీపంలోకి వచ్చేసరికి కచ్చేరిమిట్ట నుంచి ట్రంకులోకి బైక్‌పై వేగంగా రావడంతో బైక్‌ను తప్పించే క్రమంలో వ్యాన్ డివైడర్‌ను ఢీకొంది. దీంతో వ్యాను ముందు భాగంగా నుజ్జునుజ్జు కాగా వ్యాన్ నడుపుతున్న డ్రైవర్‌తో పాటు ప్రయాణిస్తున్న ఇద్దరికి తీవ్రగాయాలు అయ్యాయి. చికిత్స నిమిత్తం 108 వాహనం ద్వారా కావలి ఏరియా వైద్యశాలకు తరలించారు.

గృహ నిర్మాణాలు వేగవంతం చేయాలి



చెర్లోయడవల్లిలో గృహ నిర్మాణ లబ్ధిదారులతో మాట్లాడుతున్న ఎంపీపీ, ఎంపీడీఓ

ఆత్మకూరురూరల్: జగనన్న కాలనీల్లో గృహ నిర్మాణాలను వేగవంతం చేయాలని ఆత్మకూరు ఎంపీపీ కేతా వేణుగోపాల్‌రెడ్డి తెలిపారు. మండలంలోని చెర్లోయడవల్లి సచివాలయం పరిధిలో శనివారం గృహ నిర్మాణ లబ్ధిదారులతో ఎంపీడీఓ ఐజాక్ ప్రవీణ్‌తో కలిసి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఎంపీపీ మాట్లాడుతూ చెర్లోయడవల్లి జగనన్న కాలనీ లేఅవుట్‌లో 15 మందికి ఇళ్ల స్థలాలు మంజూరయ్యాయన్నారు. ఒక్కో ఇంటికి ప్రభుత్వం రూ.1.80 లక్షలు నిధులు మంజూరు చేస్తుందన్నారు. పొదుపు గ్రూపు సభ్యులకు రూ.35 వేలు అదనపు రుణాలు మంజూరు చేస్తామన్నారు. లబ్ధిదారులు స్వయంగానీ, కాంట్రాక్ట్ ఏజెంట్ ద్వారా తమకు మంజూరైన నివాసాలను సత్వరం నిర్మించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఐకేపీ ఏపీఎం వెంకాయమ్మ, గృహ నిర్మాణ శాఖ ఏఈ చరణ్, పంచాయతీ కార్యదర్శి సంపూర్ణ, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, పొదుపు సిబ్బంది, గృహ నిర్మాణ లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు శిక్షణ

ఉదయగిరి: పట్టణంలోని మేకపాటి రాజమోహన్ రెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శనివారం విద్యార్థులకు సర్వింగ్ హార్ట్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సంస్థ చైర్మన్ వేణుగోపాల్, ట్రైనర్ ట్రిబ్‌వన్ వృత్తి రీత్యా, జాబ్, ప్లేస్‌మెంట్‌పై శిక్ష ణ కార్యక్రమం నిర్వహించారు. శిక్షణా కార్యక్రమం విడతల వారీగా ఆర్నెల్ల పాటు జరుగుతుందన్నారు. విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. సభ్యులు శ్రీను, విజయ్, సురేష్ పాల్గొన్నారు.

ద్వారబంధం ఏర్పాటు



సంగం: స్థానిక సంగమేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో దాతల సహకారంతో నూతనంగా నిర్మిస్తున్న అయ్యప్పస్వామి ఆలయంలో శనివారం నూతన ద్వార బంధం నిలుపు కార్యక్రమాన్ని భక్తులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. ప్రత్యేక పూజలు చేసి భక్తులు అయ్యప్ప నామస్మరణలతో శుభ ముహూర్తాన నిలుపు చేశారు.

ప్రభుత్వ విద్యావిధానంలో విప్లవం

- ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి



మున్సిపల్ స్కూల్ లో విద్యార్థులకు మధ్యాహ్నం భోజనం వడ్డిస్తున్న ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి

కావలి: రాష్ట్రంలో నాణ్యమైన విద్యను ఉచితంగా ప్రభుత్వం అందించాలనే కనీస సామాజిక బాధ్యతగా భావించి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యా విధానంలో సరికొత్త విప్లవాన్ని తీసుకువచ్చారని కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని ఇందిరానగర్‌లో ఉన్న డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ మున్సిపల్ హైస్కూల్‌ను శనివారం ఎమ్మెల్యే సందర్శించారు. విద్యార్థులను పలు అంశాలపై ప్రశ్నలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం విద్యార్థులకు మధ్యాహ్నం భోజనం స్వయంగా ఎమ్మెల్యే వడ్డించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు సమూలంగా మార్చేందుకు మన బడి నాడు–నేడు కార్యక్రమాన్ని అత్యంత ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్నారని చెప్పారు. ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని రకాల మౌలిక వసతులు కల్పిస్తున్నారని వివరించారు. ప్రభుత్వ పాఠశాలలతో పాటు అంగన్వాడీ, జూనియర్ కళాశాలలను కలుపుకుని నాడు నేడుతో పాటు అదనపు తరగతి గదుల పనులను చేస్తున్నారని తెలిపారు. ఇందుకు ప్రభుత్వం సత్వరమే నిధులు మంజూరు చేస్తూ నిర్దిష్టమైన లక్ష్యాలతో పనులు పూర్తి చేసే విధంగా ప్రత్యేక కార్యాచరణతో ముందుకు సాగుతున్నారని చెప్పారు. దేశవ్యాప్తంగా ఉన్న రాజకీయ నాయకుల్లో తానే సీనియర్ అని చెప్పుకొనే చంద్రబాబు ఒకప్పుడు విజన్ 2020 అంటూ ఊదరగొట్టారని, ప్రభుత్వ పాఠశాలలను ధ్వంసం చేశాడని ఇదే చంద్రబాబు విజన్ అని ఎద్దేవా చేశారు. మరో 8 నెలల్లో మళ్లీ ఎన్నికలు ఉండడంతో విజన్ 2047 అంటూ చంద్రబాబు పాత మోసానికే కొత్త పేరు పెట్టి ప్రజలను వంచించేందుకు సిద్ధమయ్యారని ఎమ్మెల్యే మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఈ.కిరణ్, వైఎస్సార్‌సీపీ నాయకులు కేతిరెడ్డి శివకుమార్‌రెడ్డి, కనమర్లపూడి వెంకటనారాయణ, గంధం ప్రసన్నాంజనేయులు, కనుపర్తి రాజశేఖర్, కాటా శ్రీనివాసులు రెడ్డి, చెన్ను ప్రసాద్‌రెడ్డి, నెల్లూరు వెంకటేశ్వరరెడ్డి, తిరువీధి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

షిరిడీ మందిరానికి విరాళం

ఆత్మకూరు: పట్టణానికి చెందిన వైఎస్సార్‌సీపీ రైతు నాయకుడు గుండాల మునిరెడ్డి మహారాష్ట్రలోని ప్రముఖ పుణ్యక్షేత్రం షిరిడీ సాయిబాబా మందిరానికి శనివారం రూ.75 వేలు విరాళాన్ని ఇచ్చారు. మందిరం అభివృద్ధికి వినియోగించాలని కోరారు.

బైక్‌ను లారీ ఢీకొని వ్యక్తి మృతి



శ్రీనివాసరావు (ఫైల్)

కావలి రూరల్: ముందు వెళ్తున్న బైక్‌ను లారీ ఢీకొనడంతో ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన శనివారం జాతీయ రహదారిపై గౌరవరం టోల్ ప్లాజా వద్ద జరిగింది. కావలిరూరల్ ఎస్సై ఎస్.సుమన్ సమాచారం మేరకు.. కావలిలోని కలుగోళమ్మపేటకు చెందిన కోటా శ్రీనివాసరావు(61) శనివారం కొండ బిట్రగుంటలో శ్రీప్రసన్న వెంకటేశ్వరస్వామిని దర్శించుకునేందుకు తన బైక్‌పై వెళ్తుండగా టోల్‌ప్లాజా వద్దకు వచ్చేసరికి వెనుక వస్తున్న లారీ బైకును అతివేగంగా వచ్చి ఢీకొంది. బలమైన గాయాలతో అక్కడికక్కడే మృతి చెందారు. ఘటనా స్థలాన్ని పరిశీలించి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కావలి ఏరియా వైద్యశాలకు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వివాహిత ఆత్మహత్య

ఆత్మకూరు: తీవ్ర మనస్తాపానికి గురైన ఓ వివాహిత ఎలుకల మందు తిని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన ఆత్మకూరులో శనివారం జరిగింది. ఎస్సై సాయిప్రసాద్ వివరాల మేరకు ఏఎస్‌పేట మండలం శ్రీకొలను గ్రామానికి చెందిన నంది సుభాషిణి (34)కు వివాహమైంది. కొద్ది కాలానికే భర్తతో విభేదాలు రావడంతో విడిపోయారు. ఆమె తల్లిదండ్రులతో కలిసి 8 ఏళ్లుగా ఆత్మకూరులోని ఏపీఎస్ఆర్‌కాలనీలో నివసిస్తోంది. ఏడాది కాలంగా ఆమె మానసిక వేదనతో బాధపడతుండగా వైద్యులకు చూపించారు. శుక్రవారం మధ్యాహ్నం ఆమె అన్నం తినకపోవడంతో తినాలని తల్లి మందలించింది. దీంతో మనస్తాపానికి గురైన సుభాషిణి బజారుకు వెళ్తున్నానని చెప్పి వెళ్లి ఎలకల మందు తెచ్చుకుని చెరువు సమీపంలో తినింది. కొద్దిసేపటి తర్వాత సమీపంలోని వారు చూసి తల్లిదండ్రులకు చెప్పారు. ఆత్మకూరులో తొలుత చికిత్స చేయించి మెరుగైన వైద్యానికి నెల్లూరులోని ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం మృతి చెందింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సాయి ప్రసాద్ తెలిపారు.

ప్రజా వారధులు వలంటీర్లు

- మేకపాటి రాజగోపాల్‌రెడ్డి



మాట్లాడుతున్న రాజగోపాల్‌రెడ్డి

ఉదయగిరి: ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వలంటీర్లు వారధులుగా పని చేస్తున్నారని ఉదయగిరి నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డి అన్నారు. ఆయన శనివారం స్థానిక స్త్రీశక్తి భవనంలో వలంటీర్లు, పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వలంటీర్ల సేవలను ప్రజలు ఎన్నటికీ మరిచిపోలేరన్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, నవరత్నాలను అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇంటింటికీ వెళ్లి అందిస్తున్న ఘనత వలంటీర్లదేనన్నారు. కరోనా సమయంలో ప్రాణాలు పణంగాపెట్టి సేవలందించడం అభినందనీయమన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి వలంటీర్ వ్యవస్థను ప్రవేశపెట్టి దేశానికే ఆదర్శంగా నిలిచారన్నారు. వలంటీర్ల సంక్షేమం కోసం ముఖ్యమంత్రి తపన పడుతున్నారన్నారు. జీతం తక్కువని బాధపడాల్సిన అవసరం లేదని, వలంటీర్ల జీతాల పెంపు కోసం ప్రయత్నిస్తానన్నారు. కరోనా సమయంలో ఆదుకున్న జగన్‌మోహన్‌రెడ్డిని ఎవరూ మరిచిపోకూడదన్నారు. 2024 ఎన్నికల్లో 175కు 175 సీట్లు గెలుస్తామనే ధీమా జగన్‌మోహన్‌రెడ్డి వ్యక్త పరుస్తున్నారన్నారు. అందుకు ప్రతి ఒక్కరూ అండగా నిలిచి సహాయ సహకారాలు అందించాల్సిన అవసరం ఉందన్నారు. లబ్ధిదారులు సంక్షేమ పథకాలతో ఎంతో సంతోషంగా, సంతృప్తికరంగా ఉన్నారన్నారు. ఉదయగిరి 12 సచివాలయాల పరిధిలో నాలుగేళ్లలో వంద కోట్ల రూపాయలు ఖర్చు చేయడం జరిగిందన్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి వలంటీర్లపై పెట్టుకున్న నమ్మకాన్ని వమ్ము చేయకుండా సంక్షేమ పథకాలపై ప్రజల్లో అవగాహన కల్పించి మంచి పేరు తేవాలన్నారు. ఈ సమావేశంలో జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు గాజుల తాజుద్దీన్, ఎంపీడీఓ మల్లికార్జునరావు, ఈఓపీఆర్డీ నరసయ్య, మండల కన్వీనరు అక్కి భాస్కర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా పోలింగ్



ఎల్ఆర్ అగ్రహారం పోలింగ్ బూత్‌లో ఓటు హక్కు వినియోగించుకుంటున్న మహిళలు

జలదంకి: మండలంలోని ఎల్ఆర్ అగ్రహారం సర్పంచ్ స్థానంతో పాటు వేములపాడు పంచాయతీ 7వ వార్డుకు శనివారం ఉప ఎన్నికలు ప్రశాతంగా జరిగాయి. ఎల్ఆర్ అగ్రహారం సర్పంచ్ స్థానానికి 87.93 శాతం పోలింగ్ నమోదైంది. మొత్తం 1,268 ఓట్లు ఉండగా 1,115 ఓట్లు పోలయ్యాయి. మూడు ఓట్లు చెల్లనవిగా, ఒక ఓటు నోటాగా నమోదైంది. ఎల్ఆర్ అగ్రహారం సర్పంచ్ ఎన్నికలో టీడీపీ బలపరిచిన మంగల తిరుమల 88 ఓట్ల మెజారిటీతో గెలుపొందాడు. తిరుమలకు 447 ఓట్లు వచ్చాయి. వైఎస్సార్‌సీపీ తరఫున పరుసు వెంకమ్మ, మేకా కిరణ్ రెబల్స్‌గా పోటీపడ్డారు. పరుసు వెంకమ్మకు 359 ఓట్లు, మేకా కిరణ్‌కు 305 ఓట్లు వచ్చాయి. ఇక్కడ వైఎస్సార్‌సీపీ తరఫున ఒక్క అభ్యర్థి పోటీ చేసిఉంటే భారీ మెజారిటీ వచ్చేదని స్థానికులు చెబుతున్నారు. వేములపాడు పంచాయతీ 7వ వార్డుకు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ చేవూరు జనార్దన్‌రెడ్డి బలపరిచిన పోట్లూరి ఆదిలక్ష్మమ్మ 32 ఓట్ల మెజారిటీతో గెలుపొందింది. కలిగిరి సీఐ ఫిరోజ్, జలదంకి ఎస్సై ఆదిలక్ష్మి ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరుగకుండా బందోబస్తు ఏర్పాటు చేశారు.

వైఎస్సార్‌సీపీ మద్దతు అభ్యర్థి షేక్ మస్తాన్‌బీ గెలుపు

చేజర్ల: మండలంలోని పాతపాడు పంచాయతీ 5వ వార్డుకు జరిగిన ఉప ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ మద్దతు అభ్యర్థి షేక్ మస్తాన్‌బీ గెలుపొందారు. కొద్ది రోజులుగా ఉత్కంఠ భరితంగా సాగిన ఎన్నికల ప్రచారం అనంతరం శనివారం ఉదయం 7 నుంచి 1 గంట వరకు పోలింగ్ జరిగింది. మధ్యాహ్నం 2 గంటల నుంచి కౌంటింగ్ మొదలు పెట్టారు. మొత్తం 71 ఓట్లు ఉండగా 64 ఓట్లు పోలయ్యాయి. ఇద్దరికి సమానంగా చెరి 32 ఓట్లు వచ్చాయి. దీంతో ఎన్నికల అధికారి డీసీ మస్తానయ్య రీకౌంటింగ్ జరిపారు. రీ కౌంటింగ్‌లో కూడా తేడా రాలేదు. ఎన్నికల అధికారి లాటరీ పద్ధతిలో ఎన్నిక నిర్వహించారు. అందులో మస్తాన్‌బీని అదృష్టం వరించడంతో ఆమె గెలుపొందినట్లు ప్రకటించారు.



చేజర్ల: వార్డు సభ్యురాలిగా గెలుపొందిన మస్తాన్‌బీకి ధ్రువీకరణ పత్రం అందజేస్తున్న ఎన్నికల అధికారి


ఇస్కపల్లిలో వార్డు ఎన్నికలకు నిరాకరణ

అల్లూరు: మండలంలోని ఇస్కపల్లి పంచాయతీ శంభునిపాళెంలోని 8, 9 వార్డులకు సంబంధించి ఎన్నికలకు స్థానికులు నిరాకరిస్తున్నారు. ఇటీవల నోటిఫికేషన్ జారీ చేసినప్పటికి ఎవరు నామినేషన్లు వేయకపోవడంతో శనివారం ఎన్నికలు జరగలేదని ఎంపీడీఓ శ్రీదేవి తెలిపారు. గతంలో కూడా నోటిఫికేషన్ విడుదల చేసినా ఎవరూ పోటీ చేయడానికి రాలేదని పేర్కొన్నారు.

ప్రశాంతంగా వార్డు ఉప ఎన్నిక

కొండాపురం: మండలంలోని సాయిపేట పంచాయతీలో మూడో వార్డుకు శనివారం ఉప ఎన్నికలు నిర్వహించారు. ఈ వార్డులో మొత్తం 340 ఓట్లు ఉండగా 251 ఓట్లు పోలయ్యాయి. ఈ ఎన్నికలో టీడీపీ సానుభూతిపరుడు సారంగుల రవీంద్ర 65 ఓట్లతో మెజారిటీతో గెలుపొందాడు.

అమరవీరులను స్మరించుకోవడం మన విధి



ప్రతిజ్ఞ చేస్తున్న మున్సిపల్, మెప్మా సిబ్బంది

ఆత్మకూరు: దేశ స్వాతంత్ర్యం కోసం ప్రాణాలు అర్పించిన అమరవీరులకు వందన కార్యక్రమం అజాదీకా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా ఆత్మకూరులో శనివారం మేరీ భూమి, మేరా దేశ్ ర్యాలీ నిర్వహించారు. కమిషనర్ బి నాగేశ్వరరావు తొలుత మున్సిపల్ కార్యాలయంలో అమరవీరులకు నివాళులర్పిస్తూ శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. దేశాభివృద్ధికి పాటు పడతామని అందరితో ప్రతిజ్ఞ చేయించారు. మున్సిపల్ కార్యాలయం వద్ద నుంచి మెప్మా సిబ్బంది, ఆర్‌పీలు, మున్సిపల్ సిబ్బంది, కౌన్సిలర్లు ర్యాలీ నిర్వహించారు. మున్సిపల్ బస్టాండ్ ఆవరణలోని అంబేద్కర్ బొమ్మ వరకు ఈ ర్యాలీ సాగింది. మున్సిపల్ కౌన్సిలర్లు టి. పెంచలయ్య, మహబూబ్‌బాషా, సూరా భాస్కర్‌రెడ్డి, ఎం.రాజశేఖర్, వైఎస్సార్‌సీపీ నాయకులు రహీం, మున్సిపల్ ఆర్ ఖాసీం, ఏఈ ప్రసాద్, వలంటీర్లు పాల్గొన్నారు.

వలంటీరు కుటుంబానికి రూ.5 లక్షల సాయం



వలంటీరు కుటుంబానికి సీఎం సహాయనిధి చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి

ఆత్మకూరురూరల్ (మర్రిపాడు): అకాల మరణం చెందిన అనుమసముద్రంపేట మండలం వలంటీరు కప్పల బాబు కుటుంబ సభ్యులకు రూ.5 లక్షల సీఎం సహాయనిధి చెక్కును ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి శనివారం అందజేశారు. మర్రిపాడు మండలం బ్రాహ్మణపల్లిలోని తన నివాసంలో కప్పల బాబు కుటుంబ సభ్యులకు ఆర్థిక సాయం చెక్కును అందించారు. ఏఎస్‌పేట మండల కోఆప్షన్ సభ్యులు సయ్యద్ సందానీ, షౌకత్ ఆలీ, ఉప సర్పంచ్ షేక్ సిరాజ్ ఆలీ, పఠాన్ దావూద్‌ఖాన్ తదితరులు మాట్లాడుతూ రెండేళ్ల క్రితం బాబు మరణించిన నేపథ్యంలోనే ఆ కుటుంబంలోని వారిని వలంటీరుగా నియమించారన్నారు. ప్రస్తుతం ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి ముఖ్యమంత్రి సహాయనిధి మంజూరు చేయించారన్నారు. ఇందుకు కృషి చేసిన వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ పందిళ్లపల్లి సుబ్బారెడ్డి, ఎంపీటీసీ సభ్యురాలు పందిళ్లపల్లి రాజేశ్వరమ్మకు కృతజ్ఞతలు తెలిపారు.

నవంబరు ఆఖరుకు ఆధునికీకరణ పనులు

- ఉదయగిరి సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డి



అధికారులతో కలిసి మ్యాప్‌ను పరిశీలిస్తున్న రాజగోపాల్‌రెడ్డి

ఉదయగిరి: ఉదయగిరికే తలమానికంగా ఉండే ట్యాంక్‌బండ్ ఆనకట్ట ఆధునికీకరణ పనులను ఈ ఏడాది నవంబరు చివరి నాటికి పూర్తి చేయాలని వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డి అన్నారు. ఆయన శనివారం ఆనకట్ట వద్ద జరుగుతున్న ఆధునికీకరణ పనులను జలవనరుల శాఖ అధికారులతో కలిసి పరిశీలించారు. నిర్మాణానికి సంబంధించిన మ్యాప్‌ను ఆయన పరిశీలించి వివరాలు అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ నిర్మాణ పనులు దృఢంగా చేయాలన్నారు. రాబోయే వర్షా కాలాన్ని దృష్టిలో ఉంచుకుని పనులు వేగవంతంగా చేపట్టి నాణ్యతా ప్రమాణాలు పాటించాలన్నారు. ఆనకట్ట ఆధునికీకరణతో ఉదయగిరికి నూతన శోభ సంతరించుకుంటుందన్నారు. ఆనకట్ట చుట్టూ 9 మీటర్ల వెడల్పుతో కట్ట ఏర్పాటు చేసి రాళ్లతో రివిట్‌మెంట్ చేయడం జరుగుతోందన్నారు. వంతెనలు, వాకింగ్ ట్రాక్, పార్కింగ్ పార్కు ఏర్పాటు చేసి విద్యుద్దీపాలతో కాంతివంతంగా, సుందరవనంగా తీర్చిదిద్దుతామన్నారు. ఆనకట్ట అభివృద్ధికి మరిన్ని నిధులు మంజూరయ్యేలా చర్యలు చేపట్టి అభివృద్ధి చేయడంతో పాటు టూరిజంశాఖ అధికారులతో మాట్లాడి పురాతన ఆలయాల అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. ఉదయగిరిలో తాగునీటి సమస్య ఉన్నట్లు తన దృష్టికొచ్చిందని, విషయాన్ని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులతో మాట్లాడానన్నారు. సక్రమంగా నీరు సరఫరా చేసేలా అధికారులను ఆదేశించానన్నారు. ఈ కార్యక్రమంలో జలవనరులశాఖ ఈఈ వెంకటేశ్వర్లు, ఏఈలు చంద్రమౌళి, సురేష్, వేణు, ఎంపీడీఓ మల్లికార్జునరావు, యువ నాయకుడు మేకపాటి అభినవ్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనరు అక్కి భాస్కర్‌రెడ్డి, జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు గాజుల తాజుద్దీన్, ఈఓపీఆర్డీ నరసయ్య నాయకులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయం ప్రారంభం



మేకపాటి రాజగోపాల్‌రెడ్డిని ఆశీర్వదిస్తున్న వేదపండితులు

దుత్తలూరు: దుత్తలూరులోని జేఎస్సార్ ఫౌండేషన్‌లో వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ కేంద్ర కార్యాలయాన్ని శనివారం సాయంత్రం ఉదయగిరి నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డి ప్రారంభించారు. వేదపండితుల మంత్రోచ్చారణ నడుమ ప్రత్యేక పూజలు నిర్వహించి కార్యాలయాన్ని ప్రారంభించారు. అనంతరం ఆయనకు వేదపండితులు ఆశీస్సులు అందించారు. నియోజకవర్గంలోని పలు మండలాల నుంచి వచ్చిన నాయకులు, కార్యకర్తలు ఆయనకు అభినందనలు, శుభాకాంక్షలు తెలిపారు. పలువురు మాట్లాడుతూ నియోజకవర్గానికి మధ్య ప్రాంతమైన దుత్తలూరులో కేంద్ర కార్యాలయాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ఇక నుంచి నియోజకవర్గ ప్రజలు తమ సమస్యలపై సమన్వయకర్తను కలుసుకోవాలంటే దుత్తలూరులోని కేంద్ర కార్యాలయం వద్ద సంప్రదించవచ్చన్నారు. 2024లో భారీ మెజారీతో రాజగోపాల్‌రెడ్డి ఎమ్మెల్యేగా గెలవడం తథ్యమని పలువురు నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు లెక్కల లక్ష్మీకాంతమ్మ, దుత్తలూరు, ఉదయగిరి, వింజమూరు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్లు దొంతిరెడ్డి వాసుదేవరెడ్డి, అక్కి భాస్కర్‌రెడ్డి, శ్రీనివాసులురెడ్డి, సొసైటీ అధ్యక్షుడు తుమ్మల వెంగయ్యచౌదరి, మండ్ల శ్రీనివాసులు, జేఎస్సార్ ఫౌండేషన్ అధినేత దొంతిరెడ్డి జయసింహారెడ్డి, మాజీ ఏఎంసీ చైర్మన్ అలీఅహ్మద్, జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు గాజుల తాజుద్దీన్, తదితర నాయకులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమిలో హెచ్చరిక బోర్డు



మర్రిపాడులో ప్రభుత్వ భూమిలో ఎవరూ ఆక్రమించరాదని తహసీల్దారు పేరుతో బోర్డు ఏర్పాటు చేస్తున్న వీఆర్‌ఓ వెంకటేష్

ఆత్మకూరురూరల్(మర్రిపాడు): మండలంలోని అల్లంపాడు రెవెన్యూ పరిధిలోని మర్రిపాడులో ఆక్రమణలకు గురవుతున్న ప్రభుత్వ భూమిలో రెవెన్యూ అధికారులు శనివారం హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. అల్లంపాడు, ఇర్లపాడు రెవెన్యూ గ్రామాల్లో ప్రభుత్వ భూమిలో ఎలాంటి అనుమతులు లేకుండా దుక్కిదున్ని సాగు చేసేందుకు ఆక్రమణదారులు ప్రయత్నిస్తున్న విషయం రెవెన్యూ అధికారులకు సమాచారం అందింది. దీంతో తహసీల్దారు ఆనందరావు స్థానిక వీఆర్‌ఓ వెంకటేష్‌తో విచారణ చేపట్టారు. అల్లంపాడు రెవెన్యూ పరిధిలోని సర్వే నంబరు 1155, 1165, 1166, 1164, 1156లో సుమారు 66 ఎకరాల ప్రభుత్వ భూమి ఉన్నట్లుగా గుర్తించారు. ఆ భూమిని చదును చేసి ఆక్రమణదారులు ఆక్రమించి ట్రాక్టర్లతో సేద్యం చేస్తున్నట్లు నిర్ధారణకు వచ్చారు. ప్రభుత్వ భూమిని ఎవరూ ఆక్రమించేందుకు వీలు లేదని అతిక్రమిస్తే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశారు.

సచివాలయంలో ఆర్డీఓ తనిఖీ



రికార్డులు తనిఖీ చేస్తున్న ఆర్డీఓ కరుణకుమారి

చేజర్ల: మండలంలోని చిత్తలూరు సచివాలయాన్ని ఆత్మకూరు ఆర్డీఓ కరుణకుమారి శనివారం తనిఖీ చేశారు. పలు రిజిస్టర్లు పరిశీలించి ప్రజలకు అందుతున్న సేవలపై ఆరా తీశారు. పనితీరు మెరుగు పరచుకోవాలని సిబ్బందికి సూచించారు. చేజర్లలో జరుగుతన్న రీసర్వేపై సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. జగనన్నకు చెబుతాంలో వస్తున్న అర్జీలను త్వరితగతిన పరిష్కరించాలన్నారు. ఓటర్ల జాబితా పరిశీలన ప్రక్రియను తనిఖీ చేశారు. ఓటర్ల సర్వేను త్వరితగతిన పూర్తి చేయాలని సిబ్బందిని కోరారు. ఆమె వెంట తహసీల్దార్ విజయ్ ఉన్నారు.

విద్యార్థులకు పోలీస్‌లు విద్యాసామగ్రి పంపిణీ



విద్యార్థులకు విద్యా సామగ్రి పంపిణీ చేస్తున్న పోలీస్ సిబ్బంది

చేజర్ల(సోమశిల): అనంతసాగరంలోని ఎస్సీ పాఠశాల విద్యార్థులకు పోలీస్ పోలీస్ సిబ్బంది శనివారం విద్యా సామగ్రి పంపిణీ చేశారు. నోటు బుక్స్, జామెంట్రీ బాక్స్‌లు, పెన్నులు, పెన్సిల్‌లు అందజేశారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పి కిరణ్‌కుమార్, బుచ్చయ్య, సుమన్, నారాయణ, కోటి, ఎంఈఓ ప్రభాకర్‌రెడ్డి పాల్గొన్నారు.